ప్రజాశక్తి
ఆదివారం 4 జనవరి 2026
5
శ్రీ సత్యసాయి

'కోడిగుడ్లలో కోట్లు కొట్టేస్తున్నారు'..!

- మధ్యాహ్న భోజనంకు సరఫరా చేయని కాంట్రాక్టర్
- జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి
- ఎమ్మెల్యేలందరూ గైర్హాజరే..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మధ్యాహ్న భోజనంలో పిల్లలకు ఇవ్వాల్సిన కోడిగుడ్లను ఇవ్వకుండా కాంట్రాక్టర్లు కోట్లు కొట్టేస్తున్నాడని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్ ఓ.ఆనంద్ స్పందిస్తూ ఈ విషయంపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేసి విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ హాలులో ఛైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన శనివారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంక్షేమం, విద్య, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగాలపై చర్చ జరిగింది.

జెడ్పీ సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ ఆనంద్

గుడ్లలో కోట్లు కొట్టేస్తున్నారు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందించే కోడిగుడ్లలో జరుగుతున్న అక్రమాలపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సమావేశంలో అధికారులను నిలదీశారు. మధ్యాహ్న భోజనంను జిల్లాలో నాలుగు లక్షల మంది విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. కోడిగుడ్లను వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే ఇస్తున్నారని, దీనిపై తాను స్వయంగా పరిశీలించానని చెప్పారు. గుడ్లు ఇవ్వకుండానే ఇచ్చినట్టు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నమోదు చేసి బిల్లులు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కోడిగుడ్డ ధర ఏడు రూపాయలకు పైగా ఉందన్నారు. ఈ లెక్కన నాలుగు లక్షలకు చూస్తే రూ.28 లక్షల వరకు ఒక్క రోజుకే కాంట్రాక్టర్‌కు మిగులుతోందన్నారు. ఇలా నెలలో నాలుగైదు రోజులు ఇవ్వకుండానే బిల్లులు చేస్తున్నారన్నారు. గుడ్లు ఇవ్వడం లేదన్న విషయాన్ని ప్రధానోపాధ్యాయులు తెలియజేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గుడ్ల పంపిణీలో జరుగుతున్న ఈ అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ ఆనంద్ స్పందించారు. గుడ్ల పంపిణీలో వస్తున్న ఆరోపణలపై విచారణకు ముగ్గురు సభ్యులతో విద్యా శాఖ కాని వారిని కమిటీగా నియమిస్తామని చెప్పారు. వారు పరిశీలించి నివేదిక ఇచ్చాక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సంక్షేమంపై అధికార, ప్రతిపక్షపార్టీ మధ్య రగడ

సంక్షేమం మీరు చేయలేదంటే మీరు చేయలేదంటూ మెజార్టీ సభ్యులున్న వైసిపి జడ్పిటిసి సభ్యులు, ఎంపి బికె.పార్థసారధి మధ్య సభలో వాగ్వాదం జరిగింది. వికలాంగుల పింఛన్లు తొలగించారని జడ్పిటిసి సభ్యులు ఆరోపించారు. ఎవ్వరివీ తొలగించలేదని బికె.పార్థసారధి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మాటలు అమలు చేయలేదని వైసిపి ప్రభుత్వాన్ని ఉద్దేశించి విమర్శించారు. ఈ వాదనల అనంతరం కలెక్టర్ ఆనంద్ వివరణిచ్చారు. ప్రభుత్వం వైపు నుంచి ఎక్కడా విధానపరంగా తొలగింపులు జరగలేదని చెప్పారు. ఎక్కడైనా అటువంటి ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగునీటికి రూ.2600 కోట్లతో ప్రతిపాదనలు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ

సురక్షిత తాగునీటిని అందరికీ అందివ్వాలన్న ఉద్దేశ్యంతో జల్ జీవన్ మిషన్ కింద ఉపరితల నీటిని అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసామని ఆర్‌డబ్ల్యుఎస్ అంశంపై సమావేశంలో చర్చకొచ్చినప్పుడు అనంతపురం ఎస్‌ఇ వివరణిచ్చారు. నియోజకవర్గాల వారీగా ఈ రకమైన ప్రతిపాదనలను రూ.2600 కోట్లతో చేపట్టామన్నారు. 2028లోపు దశల వారీగా వీటిని పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఇవి పూర్తయితే ప్రతి ఇంటికీ సురక్షిత నీటిని అందించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు.

కందుల కొనుగోలును ఆరంభించాలి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

కంది పంట కొనుగోలును సాధ్యమైనంత త్వరగా ఆరంభించాలని వ్యవసాయంపై చర్చ జరిగిన సమయంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరారు. ఈ-క్రాప్ బుకింగ్ జరిగిన వారి పంటనే కొనుగోలు చేస్తారని, రిజిస్ట్రేషన్ పెట్టడం వల్ల రైతులకు ప్రయోజనం లేదని చెప్పారు. అదిలేకుండానే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను అడిగారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రిజిస్ట్రేషన్ అన్నది ఎప్పుడైనా చేసుకోవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసినంత మాత్రాన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలి అన్న నిబంధనేది లేదని చెప్పారు. రైతుకు ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ ఉందని తెలిపారు. ఇది సేకరణకు ఒక అంచనా కోసం మాత్రమేనని పేర్కొన్నారు.

ఒక్క ఎమ్మెల్యేకు తీరిక లేదు..!

ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే తీరిక ఒక్క ఎమ్మెల్యేకి లేకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపిలున్నారు. ఇందులో ఒక్క ఎమ్మెల్యే కూడా శనివారం నాడు జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరవలేదు. సాధారణంగా ఈ సమావేశాన్ని అత్యంత ప్రాధాన్యతతో చూస్తారు ఎందుకంటే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశంలో క్షేత్ర స్థాయిలో అధికారుల పనితీరుతోపాటు, ప్రజా సమస్యలు చర్చకొచ్చే అవకాశముంటుంది. ఇందులో పాల్గొనడం ద్వారా వాటిని గ్రహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాల్సినవి కొన్ని ఉంటాయి. ఇంతటి కీలకమైన సమావేశానికి ఏ ఒక్కరు హాజరవకపోవడం గమనార్హం. ఒక్క హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారధి హాజరయ్యారు. ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాత్రమే హాజరయ్యారు.

సిఐ శ్రీకాంత్‌తో ఎమ్మెల్సీ అనుయాయుడి వాగ్వావాదం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో హాలు బయట ద్వారం వద్ద ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుయాయుడు బొజ్జ మైసూరారెడ్డి కుర్చీలో కుర్చున్నాడు. ఆయన ప్రజాప్రతినిధి కానందున సమావేశం నుంచి బయటకు వెళ్లాలని బందోబస్తులో ఉన్న టుటౌన్ సిఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఇద్దరూ పరస్పరం వాదించుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న రాంగోపాల్‌రెడ్డి బయటకొచ్చారు. ఎమ్మెల్సీ రాగానే ఆయన అనుయాయుడు బొజ్జ మైసూరారెడ్డి సిఐపై మరింత దురుసుగా మాట్లాడారు. అక్కడున్న తోటి పోలీసు సిబ్బంది ఒక్కసారిగా మైసూరారెడ్డితో వాదనకు దిగారు. ఇంతలోనే రాంగోపాల్‌రెడ్డి కలుగజేసుకుని ఇద్దరికి సర్దిజెప్పి మైసూరారెడ్డిని సర్వసభ్య సమావేశం జరుగుతున్న హాలులోకి తీసుకెళ్లారు.

సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎంపి పార్థసారథి)

నేరాల నియంత్రణే లక్ష్యం

ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి

జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పని చేయాలని ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. శనివారం పుట్టపర్తి సాయి ఆరామంలో జిల్లా పోలీసులతో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, గ్యాంబ్లింగ్, క్రికెట్ కోడిపందాలు వంటి లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసుల విచారణను మరింత వేగవంతం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలన్నారు. అన్ని ప్రధానమైన ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పెండింగ్ కేసులను తగ్గిస్తూ దర్యాప్తులను వేగవంతం చేయాలన్నారు. కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులు త్వరగా ట్రయల్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రశంసలు - అవార్డులు:

2025 సంవత్సరంలో అన్ని విభాగాల్లో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన 8 మంది డీఎస్పీలు, సిఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు, హోంగార్డులను ఎస్పీ అభినందించి అవార్డులు అందజేశారు. కదిరి డీఎస్పీ శివన్నారాయణ స్వామి, పెనుగొండ సిఐ రాఘవన్, హిందూపురం రూరల్ అప్ గ్రేడ్ సిఐ ఆంజనేయులు, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణతో పాటు పలువురు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లను అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాని, డీఎస్పీలు విజయకుమార్, మహేష్, హేమంత్ కుమార్, నరసింగప్ప, శివనారాయణ స్వామి, ఇందిరతో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

5న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో

'రెవెన్యూ క్లినిక్స్' : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈనెల 5న సోమవారం జిల్లాలో అన్ని రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాల్లో "రెవెన్యూ క్లినిక్స్" కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించి భూమి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలియజేశారు. దీనిపై శనివారం నాడు జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5న పుట్టపర్తి, కదిరి, మడకశిర, ధర్మవరం, పెనుగొండ డివిజన్ కేంద్రాల్లో ఆయా ఆర్డీవోల ఆధ్వర్యంలో రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. ఇందులో సంబంధిత తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందరూ సంబంధిత రికార్డులతో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమంలో అడంగల్‌లో మార్పులు చేర్పులు, మ్యుటేషన్స్, పట్టాదార్ పేరు మార్పులు, అసైన్మెంట్ పట్టా, ఎఫ్లైన్, జాయింట్ ఎల్పీఎం సబ్ డివిజన్, 22 ఏ చుక్కల భూములు, రస్తా, శ్మశాన వాటికల సమస్యలు, వివిధ భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ రికార్డుల సవరణ, వారసత్వ నమోదు, ఆక్రమణలపై ఫిర్యాదులు తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ కేవలం కార్పొరేట్ శక్తుల లాభాల కోసమే అన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాల్సిన వైద్యం, వైద్య విద్యను కార్పొరేట్‌కు ధారాదత్తం చేసి పేదలకు అన్యాయం చేస్తోందని, దీనికి మంత్రి సత్యకుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిఒలు 590, 107, 108 వెంటనే రద్దు పరచాలని లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడాతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శేఖర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి కోర్టు పనితీరు భేష్ : ఎడిజె

ఎడిజె హరితను సత్కరిస్తున్న పుట్టపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి కోర్టు పనితీరుపై ఫ్యామిలీ కోర్టు సెవెంత్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి టి.హరిత సంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం ఆమె పుట్టపర్తి కోర్టును సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమెకు ముందుగా పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా స్వాగతం పలికిన పిమ్మట మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆమె పుట్టపర్తి కోర్టు పనితీరుపై బార్ సభ్యులతో వాకబు చేశారు. అడ్మినిస్ట్రేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల సత్వర పరిష్కార దిశగా పురోగతి ఉందని అభిప్రాయపడ్డారు. లోక్ అదాలత్ ద్వారా పలు కేసులకు చక్కటి పరిష్కారం చూపు తున్నారని ప్రశం సించారు. బార్ అండ్ బెంచ్ మధ్య సత్సంబంధాలు భేషుగ్గా ఉన్నాయని, తద్వారా డిస్పోజల్ సంఖ్య మెరుగ్గా ఉందన్నారు. పుట్టపర్తి జడ్జి ప్రత్యేక చొరవతో కోర్టు పరిసరాలు చక్కగా ఉన్నాయని బార్ సభ్యు లు ఆమెకు వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి అధికారి పనితీరుపై కూడా ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మున్ముందు కూడా న్యాయవాదులు కేసుల సత్వర పరిష్కారంలో చక్కటి సహకారం అందిం చాలని సూచించారు. చివరగా న్యాయవాదులు ఎడిజెను శాలువాలతో సత్కరించారు. అంతకు మునుపు ఎడిజె పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో బార్ సభ్యులు అథావుర్ రెహ్మాన్, లెక్కల యదుభూషణ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకం అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహకు హిందూపురానికి చెందిన ముస్లిం నగర ఛైర్మన్ ఉమర్ ఫారూఖ్ ఖాన్ భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకాన్ని పరిచయం చేశారు. మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్‌తో కలిసి అందచేశారు.

మాలధారులకు అన్నదానం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తుల అన్నదానం కోసం దాతల సహకారం అభినంద నీయమని అన్నదాన కమిటీ ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. బెంగళూరు రోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి సన్నిధానంలో గత 48 రోజులుగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా దేవాలయంలో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాలధారుల అన్నదానం కోసం దాతల సహాయ సహకారాలు, సేవకుల సేవా స్ఫూర్తి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంగేష్, భాస్కర్, అమర్నాథ్, చంద్ర మోహన యాదవ్, సురేష్ నాయక్, నిమ్మకాయల రాము, ఆదినారాయణ పాల్గొన్నారు.

సిఐ చంద్ర ఆంజనేయులుకు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం అప్ గ్రేడ్ సీఐ చంద్ర ఆంజనేయులు ఉత్తమ అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం ఆయన అవార్డును ఎస్పీ సతీష్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. హిందూపురం మండలం తూముకుంట పారిశ్రామిక వాడలో సంచలనం రేపిన స్టేట్ బ్యాంక్ దోపిడీ కేసును ఛేదించడంలో సిఐ చంద్రాంజనేయులు కీలక పాత్ర పోషించారు. హర్యానకు చెందిన కరుడుగట్టిన దోపిడీ దొంగల ముఠాను అరెస్టు చేయడంతో పాటు దోపిడీకి గురైన ఖాతాదారుల బంగారం నగలను ధైర్య సాహసాలతో రికవరీ చేశారు. దీంతో ఆయన పనితీరును గుర్తించిన ఉన్నతాధికారులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిఐగా అవార్డులు అందజేశారు.

మెమెంటో అందజేసి సిఐను అభినందిస్తున్న జిల్లా ఎస్పి

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

మహిళా అభ్యుదయ వాది, మహిళల చదువుల తల్లి సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం హిందూపురంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఓరియంటల్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలు, సతీసహగమనంపై సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాన్ని వక్తలు కొనియాడారు. నేటి మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని ఆమెకు నివాళులర్పించారు. ఇందులో భాగంగా పాఠశాలలో పనిచేసే మహిళా ఉపాధ్యాయునులకు పుష్పగుచ్ఛాలికి దుశాలువాతో సన్మానించారు. బాలికలందరూ సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం, సీనియర్ ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాస్, రామాంజనేయులు, రమేష్ రెడ్డి, నాగప్ప, క్రిష్టప్ప, నరేష్, బాలకృష్ణ, సతీష్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పిఆర్‌లో

హిందూపురం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారక విభాగం ఆధ్వర్యంలో శనివారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సభకు హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ఎన్నో ఆటంకాలు ఉన్న రోజుల్లోనే మహిళా సాధికారత కోసం, మహిళలకు విద్యాభివద్ధిని వ్యాపింప చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా॥శ్రీలక్ష్మి, అధ్యాపకులు డా॥సరస్వతి, డా॥ హేమా మారుతి, సుమంగళి, డా॥రవినాయక్, కళావతి, నసీమా భాను, హసీనా బాను, నుషరత్ భాను, నందిని, అప్సాన, అనూష పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత అని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తే ఏ సమస్యనైనా త్వరితగతిన పరిష్కరించవచ్చుని ఆర్‌డిఒ సువర్ణ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల అధ్యక్షతన ఒకరోజు కార్యశాల(వర్క్‌షాపు) నిర్వహించా రు. అందులో బాల్య వివాహ నిరోధక చట్టం, పిల్లలకు సంబంధించిన చట్టాలు, అమలు, తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌డిఒ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేం దుకు టీమ్‌వర్క్ చేయాలన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టంలో అధికారులను బాధ్యులుగా చేస్తూ నల్లమాడ తహశీల్దార్‌ను డివిజన్ నోడల్ అధికారిగా నామినేట్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సువర్ణ

ఆయన డివిజన్‌లో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షణ చేసి నివేదిక తయారు చేయాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యతను పంచాయతీలో పని చేస్తున్న ప్రతి అధికారిపై తీసుకోవాలన్నారు. ఇందులో పంచాయతీ ప్రెసిడెంట్ ముఖ్య భూమిక పోషించాలన్నారు. సమర్థవంతంగా పని చేసిన పంచాయతీకి అన్నింటిలో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అధికారిణి ప్రమీల, బాలల సంరక్షణ సమితి ఛైర్‌పర్సన్ రామలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహం జరిగిన తర్వాత కంటే జరగక మునుపే చర్యలు తీసుకుంటే బాగుం టుందని తెలిపారు. బాల్య వివాహాలు జరగని పంచాయతీలుగా పంచాయతీ ప్రసిడెంట్ డిక్లరేషన్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కొండప్ప, ప్రొటెక్షన్ అధికారి నాగలక్ష్మి, శిశు గృహ మేనేజర్ సునీత, సఖి సెంటర్ ఇన్‌ఛార్జి బిందు, ఉమా, సోషల్ వర్కర్ ఆనంద్, వనజాక్షి, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, బాల్య వివాహ నిరోధక అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న పూజిత తండ్రి శంకరప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలావతి, ఉపాధ్యాయులు రాజేశ్వరి, గాయత్రి, అశ్విని కౌన్సిలర్ గిరీష్ కుమార్ కమిటీ ఛైర్మన్ అమత, పలువురు విద్యార్థులు శనివారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విద్యార్థిని తల్లి గంగమ్మకు రూ.6500 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఇఒ గంగప్ప తన వంతు సహాయంగా రూ.1000 అందించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-తనకల్లు

రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శ్రీచౌడేశ్వరీ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సంస్థకు చెందిన కలెక్షన్ సెంటర్, సోలార్ బల్క్ కూలింగ్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు పలు రాయితీలు ఇస్తుందన్నారు. అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉండేలా సమాయత్తం చేస్తూ వారికి వ్యవసాయంలో సలహాలు, సూచనలు, ఇస్తుంద న్నారు. దళారులు, మధ్యవర్తుల వల్ల నష్టపోకుండా ప్రభుత్వం రైతులకు ఉపయోగపడేలా గోదాముల నిర్మాణాలు చేపట్టి వారి పంటలను నిల్వ ఉంచుకునేలా ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నరసయ్య, డిపిఎం రామ్మోహన్, ఎంపిడిఒ రామ్‌కుమార్, తహశీల్దార్ షాబుద్దీన్, ఏవో భారతి, హెచ్‌ఒ లావణ్య, ఎపిఒ మరియమ్మ, సర్పంచి డి.సరస్వతమ్మ, టిడిపి మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి, ఎఫ్‌పిఒ తోట సరోజమ్మ, సిఎంఎస్ గోపినాథ్, నరసింహులు, ఎపిఎంలు జయంతి, రమణప్ప, రవీంద్ర, ఎఫ్‌పిఒ సీసీలు బాబ్‌జాన్, ప్రవీణ్, భాస్కర్, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

పూలే జీవితం స్ఫూర్తిదాయకం

జయంతి సభలో యుటిఎఫ్ నాయకులు

మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

దేశంలోనే ప్రప్రథమ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే పూలే జీవితం స్ఫూర్తిదాయకమని ఎంఇఒ రాజేశ్వరిదేవి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ రామకృష్ణ నాయక్ తెలిపారు. పూలే జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో శనివారం యుటిఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాంతినగర్ హైస్కూల్ హెచ్ఎం కె.ఉమాపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్య మాత్రమే మహిళల పట్ల చూపించే వివక్షను నిర్మూలించే సరైన ఆయుధమన్నారు. పూలే సేవలు దేశ మహిళా విద్యకు బలమైన పునాదులు వేశాయని గుర్తుచేశారు. అనంతరం శాంతినగర్ ఉన్నత పాఠశాలలో 13 మంది, సుందరయ్యనగర్ ఉన్నత పాఠశాలలో 9 మంది మహిళా ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వరకుమారి, మహిళా జిల్లా కార్యదర్శి నాగేంద్రమ్మ, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింకా హరికృష్ణ, రామాంజ నేయులు, నాయకులు డాక్టర్ రామకృష్ణ, లక్ష్మయ్య, రామ్‌ప్రసాద్, బిల్లే రామాంజనేయులు, సాయి గణేష్, ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాళ్లు టి.రాధ, కె.హెప్సిబాగ్రేస్

మహిళా ఉపాధ్యాయులకు పూలే అవార్డు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని కొండకమర్ల జడ్పీ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు టి.రాధ సావిత్రి బాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైంది. విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో శనివారం గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె అవార్డు అందుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ ఆమెను శాలువా, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి ఎన్నికైన ఉత్తమ ఉపాధ్యాయురాళ్లను సత్కరించారు. కార్యక్రమంలో గురు చైతన్య సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్, అశోక్, నాగరాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని మోదా గ్రామ జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు కె.హెప్సిబాగ్రేస్ విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలకు ప్రతిష్టాత్మక సావిత్రిబాయి పూలే దక్షిణ భారత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకొన్నారు. ఈ అవార్డును విజయవాడలో బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ నుంచి స్వీకరించారు. ఆయన ఆమెను శాలువాతో సత్కరించి, జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.

రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందజేత

రైతులకు పాసుపుస్తకాలు అందజేస్తున్న పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయానికి వచ్చే రైతులకు తక్షణ పరిష్కారం చూపాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సూచించారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో శనివారం పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పల్లె పాల్గొని మాట్లాడారు. మన భూమి–మన హక్కు కల్పించేలా కూటమి ప్రభుత్వం రీ సర్వే చేపట్టి, అర్హులైన రైతులకు భూ హక్కులతో రాజముద్ర కలిగిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తోందన్నారు. మండలంలో భూ తగాదాలు లేకుండా రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని అధికా రులకు సూచించారు. అనంతరం రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాలాంజి నేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు హరిప్రసాద్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు ఎస్.శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, పెద్దన్న, శంకర, రామకృష్ణ, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో తహశీల్దార్ స్వర్ణలత, నాయకులు ఆకులేటి భాస్కర్, ఆకులేటి వీరనారప్ప రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ భూముల రికార్డుల్లో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తుందన్నారు. పాత పాసుపుస్తకాలు వెనక్కి ఇచ్చి కొత్తవి పొందాలని సూచించారు. భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిశీలించి పరిష్కరిస్తామని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రామచంద్ర, విఆర్ఒ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అధిక ఫీజులపై ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పట్టణంలోని పద్మావతి డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కళాశాల వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్‌డి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఐఎస్‌బి రాష్ట్ర కార్య దర్శి పోతులయ్య, పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ పద్మావతి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఇంటర్న్‌షిప్ ఫీజులు, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తుందని మండిపడ్డారు. అక్రమం గా వసూలు చేసిన డబ్బులను తక్షణమే విద్యార్థులకు తిరిగి ఇవ్వాలని, లేనిచో కళాశాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నందకిషోర్, గుణ, వరుణ్, ఎఐఎస్‌బి నాయకులు వేణు, పోతులయ్య, మోహిత్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-పరిగి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విశేష కృషి చేస్తేనే ఉత్తమ ఫలితాలు, లక్ష్యాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ రాష్ట్ర విద్యా విభాగం సమన్వయకర్త మధుసూదన్ తెలిపారు. సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా శనివారం పరిగి సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్య చాలా ప్రధానమన్నారు. పోటీతత్వం అలవర్చుకుంటేనే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమం లో కెజిబివి ఎస్ఒ రమాదేవి, నరసియప్ప, ముత్యాలప్ప, రంగారెడ్డి, రత్నమ్మ, శ్యామలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఆర్‌ఎంటిల సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

విద్యాశాఖ సమగ్రశిక్షలో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ సమస్యల పరిష్కారానికి తన కృషి చేస్తానని రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆ సంఘం నాయకులు వెంకటరమణ, భాస్కర్‌నాయుడు, బ్రహ్మయ్య తెలిపారు. ఎపిసిఆర్‌ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం వారు ఎమ్మెల్సీని కలిసి పలు సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. ఎ, బి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, ఉపాధ్యాయ నియమాకాల్లో వెయిటేజీ మార్కులు కల్పించాలని, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేం, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పొడిగించాలని కోరారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 20 లక్షల పరిహారం, కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ మీ సమస్యలు త్వరలోనే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నరసింహామూర్తి, రమణ, నాగభూషణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి పత్రం ఇస్తున్న సిఆర్‌ఎంటిలు

పంట నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎడిఎ, ఏవో

పారదర్శకంగా పంటల నమోదు : ఎడిఎ

ప్రజాశక్తి-బత్తలపల్లి

రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను పారదర్శకంగా నమోదు చేయాలని ధర్మవరం ఎడిఎ లక్ష్మానాయక్ వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. రబీ సీజన్‌లో మండలంలో సాగు చేసిన పంట నమోదు పురోగతిని శనివారం ఆయన ఏవో ఓబిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను త్వరితగతిన నమోదు చేయాలని ఆదేశించారు. సాగు చేసిన పంటలను ఈ–పంటలో నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం త్వరలో మార్క్‌ఫెడ్ ద్వారా కందులు (క్వింటా రూ. 8వేలు) కొనుగోలు చేస్తుందని తెలిపారు. కంది సాగు చేసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వారి వెంట ఏఈవో శ్రీనివాసులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది రామాంజనే యులు, రైతులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి-నల్లమాడ

మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన టిడిపి కార్యకర్త వెంకటరామిరెడ్డి భార్య కళావతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తీవ్ర విషాదంలో ఉన్న ఆమె భర్త వెంకట్రామిరెడ్డిని, కుమారుడు రమణారెడ్డిని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. పల్లె వెంట టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర్, నాయకులు సూర్యనారాయణరెడ్డి, సలాంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలో శనివారం శ్రీవాణి బ్లోసమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగోలీ ద్వారా సృజనాత్మకత, కళాత్మక వ్యక్తీకరణ, సాంస్కృతిక అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ముగ్గులు వేయడం ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రతను పెంచుతుందన్నారు. బియ్యం పిండితో ముగ్గులు వేయడం ద్వారా పక్షులు, చీమలు, సూక్ష్మజీవులకు ఆహారం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. విజేతలు లితిక, దీక్షిత బహుమతులు అందుకోగా పాల్గొన్న వారందరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనజాక్షి, అశ్వినితో పాటు శ్రీవాణి, మోనికా ముల్లర్, హైచూన్, శ్రీనివాస్, మహాలక్ష్మీ, శాంతి, సరిత, గాయత్రి, కలిమున్నిసా, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి ఇస్తున్న సర్వేయర్లు

గ్రామ రెవెన్యూ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-లేపాక్షి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మండలంలోని గ్రామ సర్వేయర్లు తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసులుకి వినతి పత్రాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వేలో అనేక సమస్యలు ఎదురవడంతో పాటు ఖర్చులు అవుతున్నాయన్నారు. వాటిని ఎస్ఒపిల ద్వారా వాటికనుగుణంగా పనిచేస్తామన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని, జనరల్ సర్వేల నుంచి మినహాయించాలని, పే స్కేల్‌కి అనుగుణంగా వేతనాలు, ఉద్యోగోన్నతులు ఇవ్వాలని కోరారు. లేనిచో ఈ నెల 19వ తేదీ నుంచి రీ సర్వే ప్రక్రియ నిలిపేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు అశ్వర్ధనారాయణ, నాగేశ్వరి, శ్రీనాథ్, నిఖిల్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ..?

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ఏటా జనవరి 1వ తేదీ ప్రకటిస్తామన్న జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల ముందు 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్ ఏటా జనవరి 1వ తేదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగులకు నెలకు రూ. 3వేల చొప్పున భృతి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ లేదు నిరుద్యోగులకు భృతి లేదని ఎద్దేవా చేశారు. ఇక ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని ప్రగల్బాలు పలికిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఇలాంటి మోసపూరిత హామీల అమలుపై నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను విస్మరించడం సిఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇప్పుడు అదే విద్యను ఆయన కుమారుడు నారా లోకేష్ అనుసరిస్తున్నారని తెలిపారు. యువగళం యాత్ర యువగాలం యాత్రనా అని ఎద్దేవా చేశారు.

కొత్త ఆశలతో..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ వారం కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాం. గతేడాది మంచి చెడులను సమీక్షించుకోవడంతోపాటు అడ్డుగెట్టబోయే నూతన సంవత్సరం బాగుండాలని 2026 సంవత్సరానికి కోటి ఆకాంక్షలతో జనం స్వాగతం పలికారు. గతేడాది అంత మంచి కాదు.. అంత చెడు కాదన్నట్టు సాగింది. ప్రకృతి కూడా అదే రకంగా ఉంది. ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావం, తరువాత అధిక వర్షాలు పడ్డాయి. వ్యవసాయానికి అంతగా కలసి రాలేదు. పంటలకు ధరల్లేక నష్టపోయారు. కొత్త సంవత్సరం ఏ రకంగా ఉండనుందో చూడాల్సి ఉంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి 1వ తేదీ గురువారం నాడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఎక్కడాలేని సందడి నెలకొంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మాత్రం దీక్ష చేపట్టడం చర్చనీయాంశమైంది. నూతన సంవత్సరం రోజు దీక్ష కూర్చొని ప్రజలు పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంట్లోనున్న వృథా చెత్తను బయట పడేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. అందరం కలసి తాడిపత్రి పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకుందామని చేసిన ప్రచారం ఆసక్తికరంగానూ మారింది. ఇక డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సరం వేడుకలు జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగాయి. పెద్ద ఎత్తున ఈవెంట్లు నడిచాయి. అన్నింటికంటే పెద్దగా నిర్వహించిన హర్మోన్ సిటిలో మాత్రం అపశృతి చోటు చేసుకుంది. ఈవెంట్ ఏర్పాట్లలో పనికెళ్లిన కార్మికుడు ఒకరు విద్యుత్‌ఘాతానికి గురై చనిపోవడం పెద్ద చర్చనీయాంశమైంది. ఒకవైపు కార్మికుడు చనిపోయినా ఈవెంట్ యథావిధిగా కొనసాగడంపై విమర్శలొచ్చాయి. బయట నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు హర్మోన్ యాజమాన్యం మృతుడి కుటుంబానికి పరిహారం అందజేసింది. ఆ చిన్న ఘటన మినహా అంతటా ఉత్సాహపూరిత వాతావరణంలోనే నూతనోత్సవ వేడుకలు జరిగాయి. డిసెంబర్ మాసంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. రూ.20 కోట్లకుపైగానే మద్యం వ్యాపారం చివరి రెండు రోజులు జరిగాయి. ఇదే వారంలో సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖపట్నంలో జరుగుతున్న నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. జీపు జాతాలు, స్కూటర్ ర్యాలీలు నిర్వహించింది. అదే సందర్భంలో రాష్ట్రంలోనే మహాసభ కావడంతో బహిరంగ సభలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివెళ్లారు.

ఈ వారంలో జరగబోతున్న ఎపీ ఎన్జీవో సంఘం ఎన్నికలు వేడిని రాజేస్తున్నాయి. రెండు ప్యానల్స్ మధ్య పోటీ తీవ్రంగా ఉంది. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా ఈ ఎన్నికలు ఉండటం గమనార్హం. రెండు వైపుల నుంచి ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. కదిరి, అనంతపురంలో గంజాయి ముఠాలను పట్టుకోవడమే కాకుండా వారిని బహిరంగంగా వీధుల్లో నడిపించడం చర్చనీయాంశమైంది. గంజాయి అమ్మే బ్యాచ్‌కు పోలీసు శాఖ గట్టిగా హెచ్చరికలు చేసింది. అనంతపురం జిల్లాలోనూ పెద్దఎత్తున గంజాయి అమ్ముతున్న ఆనవాళ్లు ఉన్నాయి. పలుమార్లు పోలీసుల చేతికి చిక్కి జైళ్లకు వెళ్లినా ఇంకా అనేక మంది అమ్మకాలతోపాటు, వినియోగం చేసేవాళ్లు ఉంటున్నారు. ఇందులో అత్యధికంగా యువత ఉంటున్నారు. వాటి వాడకం నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. గంజాయిపై పోలీసులు తీసుకుంటున్న కట్టడి చర్యలు ఏ మేరకు ఫలితాలను ఇస్తాయో చూడాల్సి ఉంది.

టిడిపికి కార్యకర్తలే బలం : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

టిడిపి అభ్యున్నతికి కార్యకర్తలే నిజమైన హీరోలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గంలోని 125 మంది ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపు బాధ్యత కార్యకర్తలే తీసుకోవాలని కోరారు. పార్టీ బలోపేతంలో భాగస్వాములై తగిన పాత్ర పోషించాలని కార్యకర్తలకు సూచించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు టిడిపి సభ్యత్వం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో మండలాల కన్వీనర్లు జయచంద్ర, గోపాల్‌రెడ్డి, మైలే శంకర్, రామకృష్ణ, సహకార సొసైటీ అధ్యక్షులు శ్రీరామ్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, సామకోటి ఆదినారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

క్రీడా పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

విద్యార్థులు క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ దేవరాజు, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్‌పి.పుల్లన్న, స్టేట్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ కె.శంకర్ సూచించారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ జోనల్ లెవెల్ సెలక్షన్స్ నిర్వహించగా కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యార్థులు పాల్గొ న్నారు. అధికారులు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఓహెచ్ కేటగిరీ బాలువ విభాగంలో గౌతమ్(సత్యసాయి), చిన్నా(అనంత పురం), అవినాష్‌కుమార్(కడప), మధు (అనంతపురం), బాలికల విభాగంలో భవ్య, ఇందూ, అక్షయ, దుర్గాప్రియ(సత్యసాయి), కేటగిరి–1 బాలుర విభాగంలో వేణు, మన్విత్‌కుమార్, షేక్ మహమ్మద్ తన్వీర్(సత్యసాయి), సుదర్శన్(అనంతపురం). ఐడి విభాగంలో బాలు ప్రసాద్(సత్యసాయి), బాలికల విభాగంలో తన్మయి(సత్యసాయి), ఇయర్ రింగ్స్ విభాగంలో వెంకట సంతోష్, వెంకీ(కడప) ఎంపికయ్యారు. కార్యక్రమంలో అనంతపురం, కడప జిల్లాల సహిత విద్యా సమన్వయకర్తలు ఫణిరాజ్, రమణమూర్తి, సమగ్ర శిక్ష ఎఫ్ఒ ఆనంద్‌బాబు, పీఈటీలు వెంకటేష్, రామకృష్ణ, చంద్రశేఖర్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడుదాం

పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మహిళా, వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

సమానత్వం కోసం పూలే స్ఫూర్తితో పోరాడుదామని మహిళ, వ్యవసాయ కార్మిక సంఘాల సభ్యులు పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని మామిళ్ల కుంట క్రాస్‌లో ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ మహిళలు సైతం చదువుకోవాలని నినదించి లక్ష్య సాధన కోసం సమరశీల పోరాటం చేసిన సావిత్రీ బాయి పూలే దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎదగడం నేటి మహిళలకు ఆదర్శమన్నారు. ప్రస్తుత సమాజంలో కూడా మహిళలు పలు రంగాల్లో రాణిస్తున్నా ఉద్యోగ నియామకాలు, పని ప్రదేశాలు, వేతనాలు, తదితర వాటిల్లో మహిళల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల వివక్ష, అంటరానితనం పోవాలంటే చదువే శాశ్వత పరిష్కారం అన్నారు. కార్యక్రమంలో రమాదేవి, గౌరమ్మ, భాగ్యమ్మ, రమ్య, నవ్య, సుకన్య, మణి, మల్లమ్మ, తిరుపాలమ్మ, అఖిల, సాయిగీత, హేమలత, చిన్న నాగమ్మ, పోతక్క, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష నిర్మూలనకు కృషి చేద్దాం

పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మహిళలపై జరుగుతున్న వివక్ష, అంటరానితనం నిర్మూలన కోసం కృషి చేద్దామని ఐద్వా సభ్యులు పిలుపునిచ్చారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం స్థానిక దళిత కాలనీలో ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకు రాలు గౌతమి మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే అంతులేని బాధ, వ్యథలను దీటుగా ఎదుర్కొన్న వీర వనిత అని గుర్తు చేశారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచిందన్నారు. ప్రతి ఆడబిడ్డ చదువుకోవాలని నినదించిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు. చివరగా సంపూర్ణ అక్షరాస్యత, మహిళల పట్ల వివక్ష, అంటరానితనం నిర్మూలన కోసం నినదిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంబిక, శ్యామల, కల్పన, ఇంద్రజ, పుష్ప, భారతి, అనిత, గంగమ్మ, పూజిత, నాగమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ

విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏవో, నాయకులు

ప్రజాశక్తి-నల్లమాడ

స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద శనివారం ఏవో అబ్దుల్ హక్, టిడిపి నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, తదితరులు రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 40శాతం రాయితీతో పాసు పుస్తకానికి 3 బస్తాల చొప్పున ప్రభుత్వం రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటరంగాచారి, ఎంపీఈవో రాధ, నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి అబ్బాస్‌ఖాన్, పఠాన్ బాబావలి, సి.రాజారెడ్డి, కె.శ్రీనాథ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

5న 'ఉపాధి'పై అవగాహన

ప్రజాశక్తి- పరిగి

ఈ నెల 5వ తేదీ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో వీబి జీ రామ్ జీ మిషన్ ద్వారా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపిఒ అప్పస్వామి ఓ పత్రికటనలో తెలిపారు. పంచాయతీలో అర్హులైన లబ్ధిదారుల జాబితా తయారీ కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ మండల సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

గ్రీన్‌లైన్ హైవే పనులపై రైతు ఫిర్యాదు

హైకోర్టు ఉత్తర్వులు చూపుతున్న రైతు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని చాగలేరు గ్రామ రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ భూముల సేకరణపై హైకోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు బేఖాతరు చేస్తూ గ్రీన్ లైన్ హైవే పనులు కొనసాగిస్తున్నారని రైతు వర్షారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారంతో తమకు అన్యాయం జరుగుతుందని హైకోర్టును ఆశ్రయించగా భూమి సేకరణ చేయవద్దంటూ కోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు రాత్రికి రాత్రే భూమిని చదును చేసి హైవే పనులు చేపట్టారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనపై సంబంధిత అధికారులపై కాంటెంప్ట్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు రైతు వెల్లడించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

రామారావు(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ప్రమాదవశాత్తూ స్థానిక చెరువులో పడి ఎస్సీ కాలనీకి చెందిన రామారావు(35) శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలు... రామారావు 3 రోజులుగా కనపడక పోవడంతో బంధువులు చుట్టుపక్కల, బంధువులు గ్రామాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో శనివారం ఉదయం ఓబుళదేవరచెరువు మరువలో శవమై కనిపించాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడడంతో రామారావు మృతి చెందినట్లు భార్య మమత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

పేరుమార్పు / సవరణ

నా కుమార్తె సి.లక్ష్మి D/o సి.రామాంజినేయులు, నివాసం : డోర్ నెం.5-48, బాసన్‌పల్లి, చెన్నేకొట్టపల్లి, మేడాపురం, శ్రీ సత్యసాయి జిల్లా.

ప్రస్తుతం నా కుమార్తె ఆధార్‌లో ఆమెపేరు సి.లక్ష్మిగా నమోదు కాబడినది. ఇప్పుడు పేరుమార్పు/సవరణ చేయగా **చిమిరాలా వర్షిత D/o సి.రామాంజనేయులు (Chimirala Varshitha, D/o C.Ramanjineyulu)** గా మార్పు చేయుట జరుగుతుంది. కావున నేటి నుండి నా కుమార్తె పేరు **చిమిరాల వర్షిత**గా పిలవబడును. ఆధార్‌లో మార్పుకొరకు

IN THE COURT OF THE IIIrd ADDL. JUNIOR CIVIL JUDGE (Excise Court), ANANTAPURAMU
O.S NO: 1061/2024

Between:
Morusu Sai Prasad ...Plaintiff
And
Madineni Annapurneswara Rao ...Defendant

NOTICE TO THE DEFENDANT

To,
Madineni Annapurneswara Rao S/o M.Mallikarjuna, Milk Business, Kanaganapalli (V) & (M), Sri Sathya Sai District.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 29-01-2026 వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
N.P.SREENIVASULU,
K.JAGADEESWAR REDDY,
Advocates, Ananthapuram, Cell No: 9440753607